క్లుప్తంగా

రేషన్ డీలర్ల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యాన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌లను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ దొండ దుర్గయ్య, కార్యదర్శి షేక్ జానిమియా, కోశాధికారి కార్యదర్శి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి..

కామేపల్లి: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ కోదండరాంకు టీఎస్‌టీఏఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరూనాయక్ మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రాన్ని అందించారు. సర్వశిక్ష అభియాన్ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి టైం స్కేల్ ఇవ్వాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు కరువు భత్యం, పీఆర్సీ కల్పించాలని పలు అంశాలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగనాయక్, పాపాలాల్, సీతారాం, హనుమ తదితరులు పాల్గొన్నారు.

'ఎగ్జిట్'పై కేంద్ర మంత్రి దృష్టికి..

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని చారిత్రక ప్రదేశాలను దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, భక్తులు వస్తున్నందున్న నేలకొండపల్లి వద్ద కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలని నవీవల సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్‌తో పాటు మరికొంత మంది నిరసన దీక్షలు చేశారు. ఈ విషయాన్ని బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ద్వారా కేంద్ర రహదారి, భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా వివరాలు, ప్రజల ఆకాంక్షలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ఆర్థిక సాయం

ఖమ్మంగాంధీచౌక్: పేద విద్యార్థిని వి.జాహ్నవి ఇంటర్ విద్య కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం మానవతా దృక్పథంతో మంగళవారం నగరంలోని క్లబ్ కార్యాలయంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరాం, డాక్టర్ టీడీసీ రావు, విశ్వేశ్వరరావు, క్రిష్ణారెడ్డి, క్రిష్ణమూర్తి, దుర్గానాగేశ్వరరావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'న్యూ ఇరా'లో మాక్ పోలింగ్

ఖమ్మంసహకారనగర్: నగరంలోని న్యూ ఇరా పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఓటు వేసి తమ విద్యార్థి నాయకుడిని ఎన్నుకొగా.. పాఠశాల డైరెక్టర్ పి.ఖుమేశ్వరరావు సమక్షంలో అధ్యాపకులు విజేతల పేర్లను ప్రకటించారు. స్కూల్ పీపుల్ లీడర్‌గా కె.జార్జియ, అసిస్టెంట్ స్కూల్ పీపుల్ లీడర్‌గా బి.ఐశ్వర్య ఎన్నికయ్యారు.

వ్యక్తికి గాయాలు..

కామేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలిలా.. మండలంలోని పొన్నేకల్ గ్రామానికి చెందిన గొడవర్తి సీతారామయ్య తన ద్విచక్రవాహనంపై కామేపల్లి వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో తాళ్లగూడెం తిరుమలమ్మ గుడి సమీపంలో బైక్ అదుపుతప్పి పల్టీకొట్టగా.. గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువతరాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



బచ్చోడులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: యువతను చెడు మార్గాల వైపు నడిపిస్తున్న గంజాయి, డ్రగ్స్ మత్తు పానీయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి గొగ్గెపాటి రమేష్ అన్నారు. మంగళవారం ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఈనెల 22, 23 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో జరిగే రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు యువతరాన్ని నిర్వీర్యం చేసే విధానాలను తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఆరోపించారు. అందులో భాగంగానే పీవైఎల్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జరుపుతున్నామని, ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు దారమల్ల శంకర్, గొర్రెపాటి భగత్‌సింగ్, వంగూరి రవి, జిల్లా ఉప్పయ్య, మహేష్, వెంకన్న, బ్రహ్మచారి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ సహకరించకున్నా..

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న వెంకటాయపాలెం రెవెన్యూ పరిధిలోని నవోదయ కాలనీలో 300 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. అయితే వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో రోడ్లు, డ్రెయిన్లు, కరెంట్ స్తంభాలు, నీటి వసతి కరువయ్యాయి. దీంతో కాలనీవాసులే సొంతంగా నిధులు సేకరించి సోలార్ ప్యానల్‌తో బోరు ఏర్పాటు చేసుకుని దాత ఇచ్చిన వాటర్ ట్యాంకర్‌తో కాలనీ అంతా నీటి సరఫరా చేసుకుంటున్నారు. అలాగే సొంతంగా కరెంట్ స్తంభాలు వేసుకున్నామని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



బోరు వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్, జనరేటర్



దాతలు ఇచ్చిన ట్యాంకర్‌తో కాలనీలో నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

'చెత్త' రాతలేనా..?



మామిళ్లగూడెం రామాలయం రోడ్డులో ముగ్గుతో రాసిన చోటే వ్యర్థాలు పోసిన స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని డివిజన్లలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు కార్పొరేషన్ అధికారులు ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్నారు. రోడ్ల వెంట, కూడళ్లలో వ్యర్థాలు వేయొద్దని, చెత్త ట్రాక్టర్‌లో వ్యర్థాలు వేయాలని మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు.. నగరంలోని ప్రజలు కొందరు ఇష్టం ముందు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్నారు. అక్కడ శుభ్రం చేసి చెత్త వేయొద్దని కేఎంసీ సిబ్బంది ముగ్గుతో రాసినా.. తమకేమి పట్టనట్టు కొందరు అక్కడే చెత్త వేసి తమ నైజాన్ని చాటుకున్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



ఖమ్మంరూరల్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. ఈమేరకు మంగళవారం మండలంలోని ఏదులాపురం సహకార సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని తెలిపారు. రూ. 2లక్షలు పైబడిన నగదును రైతులు చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని చెప్పడం సరికాదని, ప్రస్తుత పెట్టుబడి సీజన్‌లో రైతులు వ్యవసాయ ఖర్చులకే అప్పు చేయాల్సి వస్తోందని, ఇప్పుడు రైతులకు చెల్లింపులు సాధ్యమా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోకుండా రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలను తక్షణమే మాఫీ చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలిపారు. నాగభూషణం, ఏఛూరి లతాదేవి పాల్గొన్నారు.

రుణాల కోసం రైతుల ఆందోళన..

నేలకొండపల్లి: రుణమాఫీ పొందిన రైతులు తిరిగి రుణాల కోసం మంగళవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా, నేలకొండపల్లి సొసైటీలో సిబ్బంది కొరత కారణంగా రుణాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్ శీల రమణయ్య మాట్లాడుతూ.. రుణమాఫీ చేసిన సంతోషం కంటే, సిబ్బంది రుణాల చెల్లింపులో చేస్తున్న జాప్యంతోనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని వెంటనే రుణాలు అందించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈమేరకు సిబ్బంది కొరత ఉన్నప్పటికీ త్వరగా రుణాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సొసైటీ సీఈఓ ఓ.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి..

కామేపల్లి: ఎటువంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష నాయకులు రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు దుగ్గి కృష్ణ, మూడ్ ప్రసాద్‌నాయక్, జర్పుల రామారావు, మల్లెంపాటి శ్రీనివాసరావు, ఆజ్మీరా రాజునాయక్, బాగం రంగారావు, పోలూరి రామచంద్రయ్య, యంజం

ఆదేశాలు వచ్చాకే అప్పు చెల్లించాలి..

ఖమ్మంఅర్బన్: రైతులకు రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాకే రూ.2 లక్షల కంటే అప్పు ఉన్న వాళ్లు నగదు చెల్లించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ నేపథ్యం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధంసలాపురం క్లస్టర్ అల్లీపురం రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో రైతుల సందేహాలను వారు నివృత్తి చేశారు. కాగా, వరి పంటలో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు చేశారు. కుటుంబ సభ్యులు నిర్ధారణ కాని వారు, ఆధార్‌లో పేరు తప్పు ఉన్నవారు రెండు రోజుల్లో వ్యవసాయ అధికారులను కలిసి ఆన్‌లైన్‌లో సరిచేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, ఖమ్మం అర్బన్ వ్యవసాయ అధికారి బి.కిషోర్‌బాబు, ఏఈఓ దివ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మురుగు ఎక్కడా కన్పించొద్దు..



పారిశుద్ధ్య పనులపై ఆరా తీస్తున్న కమిషనర్

ఖమ్మంఅర్బన్: డివిజన్లలో మురుగు ఎక్కడా కన్పించకుండా చర్యలు చేపట్టాలని, ప్రతీ మంగళ, శుక్రవారాల్లోనే కాకుండా డ్రైడే కార్యక్రమాన్ని నిరంతరం సాగించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. మంగళవారం నగరంలోని 9వ డివిజన్ రోటరీనగర్‌లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వీధుల్లో చెత్త నిల్వలు లేకుండా చూడాలని, డ్రెయిన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈమేరకు పారిశుద్ధ్య కార్మికులు, శానిటేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు బానోత్ సోని, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కూసుమంచి: నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఖమ్మం లీగల్/కూసుమంచి: కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హేయమైన దుశ్చర్యలను ఖండిస్తూ ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం రాత్రి న్యాయవాదులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కోర్టు నుంచి జెడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, కార్యవర్గం, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే కూసుమంచిలోని గ్లోబల్–రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆడపిల్లలను బతికించండి, రక్షించండి అంటూ విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యుడు కూరపాటి ప్రదీప్, ఎంఏ ప్రజారోగ్య డాక్టర్ స్వప్నశ్రీ, కరస్పాండెంట్లు మహ్మద్ ఇర్ఫాన్ అహ్మద్, కొక్కిరేణి సీతారాములు, అకడమిక్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, జర్నలిస్ట్ జబీర్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

నేలకొండపల్లి: గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఎంపీడీఓ ఎ.యర్రయ్య అన్నారు. మండలంలోని బుద్ధారంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆయన పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్‌లో వచ్చే వ్యాధులపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, అందుకు ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది గ్రామాల్లోకి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉండుకునేలా అవగాహన కల్పించాలని, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యాధికారి, వైద్య సిబ్బంది పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ పర్యటన..

తిరుమలాయపాలెం: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై నిర్లక్ష్యం చేయొద్దని మండల ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ అన్నారు. మంగళవారం మండలంలోని కేశ్వాపురం, పిండిప్రోలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దోమలు వ్యాప్తి చెందకుండా మురుగునీటి కాల్వలను శుభ్రం చేయాలని, నీరు నిల్వ ప్రదేశాలను పూడ్చి వేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తాగునీటి కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిండిప్రోలు పంచాయతీ కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

భారత్ బంద్ పోస్టర్ల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని కోరుతూ.. దేశవ్యాప్తంగా ఈ నెల 21న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా కమిటీ నాయకులు మంగళవారం నగరంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఈ బంద్‌కు అన్నివర్గాల వ్యాపారులు, విద్యా సంస్థల సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు దయానంద్, వీరబాబు, రాయల శ్రీనివాస్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం మల్లయ్య, ఉపాధ్యక్షుడు తలారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్లు..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తయినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రామయ్య పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలు కోసం ఈనెల 22న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం నగరంలోని ఖానాపురం వద్ద ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు సీహెచ్.శోభన్, కె.శ్రీనివాసు, జాలాది లెనిన్, బొమ్మకంటి రమేష్, లచ్చయ్య, నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ కౌన్సిల్ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ నిర్మాణం, ప్రజా ఆందోళనలు, సాయుధ పోరాట వారోత్సవాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్: అత్యవసర వైద్యసేవలు పొందిన పేదలకు ఆర్థికంగా అండగా నిలవాలనే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం పంపిణీ చేయనున్నారు. వైరా నియోజకవర్గ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌లో కలిసి క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు అందజేయనున్నారు. లబ్ధిదారులు తమ ఆధార్ కార్డును తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని రాపర్తినగర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని బీఎస్సీవోస్ కాలనీ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రాపర్తినగర్, బీఎస్సీవోస్ కాలనీ, బీసీ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కామేపల్లి: రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆధునికత వైపు అడుగులు..!

నర్సరీల్లో మిరపనారు పెంపకంపై రైతుల ఆసక్తి

- షేడ్ నెట్ నర్సరీలకు పెరుగుతున్న డిమాండ్
- ఖర్చు ఎక్కువైనా పట్టించుకోని వైనం
- ఒక్కో నర్సరీల్లో 15లక్షల వరకూ మొక్కల పెంపకం



నర్సరీలో పెంచుతున్న మిరపనారు

కామేపల్లి: అన్నదాతలు ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. వ్యవసాయ రంగంలో పాత పద్ధతిలో కూలీల కొరతతో పంట నష్టం కొంతమేర ఉండటంతో ఆట్టి సాగుకు నష్ట పలికి ఆధునిక సాగును ప్రారంభిస్తున్నారు. కానీ ఇప్పుడు వ్యవసాయరంగంలో కూలీలతో పాటు వ్యవసాయంగా గానికి అనుసంధానంగా ఉన్న వాటికి డిమాండ్ పెరుగుతుందని చెప్పుకోవచ్చు. అందులో మిరపనారు పెంచే షేడ్‌నెట్ నర్సరీల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. గతంలో మిరపనారు పెంపకంలో దక్కిని దున్నడం, ఎరువులు చల్లడం, విత్తనాలు పెట్టించడంతో పాటు డీడీలు, తెగుళ్ల నుంచి కాపాడడం ఇలా దాదాపు 50 రోజుల పాటు కష్టపడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నర్సరీల్లో విత్తనాలు ఇచ్చి నారు పెంపకం చేపడుతున్నారు. చాలామంది రైతులు దీని వైపే మొగ్గు చూపిస్తుండడంతో వీటికి డిమాండ్ బాగా పెరిగింది. దీంతో మండలంలోనే ఈ ఏడాది అత్యధికంగా నర్సరీలు ఏర్పాటు చేశారు.

15 లక్షల మొక్కల పెంపకం..

మండలంలో సుమారుగా 32 షేడ్‌నెట్ నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో దానిలో సుమారు 15లక్షల నుంచి 16 లక్షల వరకు మిర్చి నారును పెంచుతున్నారు. కాగా, ఒక్కో మొక్కకు 50 పైసల నుంచి 60 పైసలు చొప్పున రైతుల నుంచి నర్సరీ నిర్వాహకులు వసూళ్లు చేస్తున్నారు. ఇలా కేవలం నారు పెంపకం చేపట్టడమే ఎకరాకు సుమారుగా రూ.15 వేలకు పైగా ఖర్చు వస్తుంది. అయినా ఖర్చుకు వెనుకాడకుండా వీటిలోనే పెంచేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. విత్తనాలు నాటే దగ్గర నుంచి సుమారుగా 50 రోజుల వరకు నిర్వాహకులే ఎటువంటి తెగుళ్లు, చీడపీడలు ఆశించకుండా నారును సాకుతుంటారు.



రైతు పొలంలో ఏర్పాటు చేసిన మినీ షేడ్‌నెట్ నర్సరీ

తెగుళ్లు, చీడపీడలు బెడద తట్టుకోలేక..

మిరపనారు పెంపకంలో అశ్రద్ధగా ఉంటే మొదటికే మోసం వస్తుంది. విత్తనాలు పెట్టిన నప్పటి నుంచి నారుమడిని కంటికిరెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. వర్షాలు అధికమైతే నారుమడిలో నీరు నిల్వ సోకి నారు చనిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. వాతావరణంలో మార్పుల కారణంగా చీడపీడల ఉధృతి కూడా ఒక్కొసారి అధికంగా ఉంటుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని రైతులు నర్సరీల్లో మొక్కల పెంపకానికి మొగ్గు చూపుతున్నారు.

మినీ నర్సరీ ఏర్పాటు చేసుకున్నా..



మిరపనారు పెంపకం కోసం ఏడాదికి రూ.వేలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఈ స్వల్పం ద సన్నస సహకారంతో సుమారుగా రూ.25 వేలతో నా సొంత భూమిలో 2 కుంటల విస్తీర్ణంలో మినీ నర్సరీ ఏర్పాటు చేసుకున్నా. సుమారుగా లక్ష మొక్కలు పెంపకం చేపట్టా. దీంతో నారు పెంపకం ఖర్చు పూర్తిగా తగ్గింది.

– అంబటిపూడి రాము, రైతు, పండితాపురం

నాణ్యమైన నారు అందిస్తున్నాం..



నర్సరీల్లో నాణ్యమైన నారు రైతులకు అందుబాటులో ఉంచుతున్నాం. నర్సరీలో నారు పెంపకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యమైన నారును 40 నుంచి 50 రోజుల్లో పెంచి అందిస్తాం. అందుకు మొక్కకు రూ.0.60 పైసలు చొప్పున వసూలు చేస్తాం. ఖర్చు ఎక్కువ అయినా రైతులకు ప్రయోజనమే.

– తూము వెంకటేశ్వర్లు, నర్సరీ నిర్వాహకుడు

లైసెన్స్ పొందిన నర్సరీల్లోనే..



ఉద్యాన శాఖ ద్వారా లైసెన్స్ పొందిన నర్సరీల్లోనే రైతులు మిరపనారు పెంచుకోవాలి. కొనుగోలు చేసుకోవాలి. అంతేకాక నర్సరీల్లో కొనుగోలు చేసిన మిరపనారు మొక్కల వివరాలతో కూడిన రశీదును పొంది భద్రపర్చుకోవాలి. కొంతమంది రైతులు తమ సొంత పంట పొలాల్లోనే నర్సరీ ఏర్పాటు చేసుకుని నారు పెంచుకుంటున్నారు. అధికారుల సలహాలు తీసుకోవడం మంచిది.

– ఆకుల వేణు, వైరా డివిజన్ ఉద్యాన అధికారి